24012025-DIS-04_Layout 1 1/24/2025 3:08 AM Page 1

వేదిక

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

ప్రజాగ్రహ సభలు

అందరిని కొన్నిసార్లు మోసగించవచ్చు. కొందరిని అన్నిసార్లూ మోసగించవచ్చు.. కానీ అందరినీ, అన్నిసార్లూ మోసగించలేం అనేది నానుడి. తెలంగాణ గ్రామాల్లో ఎగసిపడుతున్న తిరుగుబాట్లకు ఇది చక్కగా వర్తిస్తుందని చెప్పవచ్చు. కాంగ్రెస్ జిత్తులమారి హామీలను ఎక్కువగా నమ్మింది అమాయక గ్రామీణ ప్రజలే. ఇప్పుడు మోసపోయి గోసపడుతున్నామని తెలుసుకున్నదీ వారే. తగుదునమ్మా అంటూ కాంగ్రెస్ సర్కారు పెడుతున్న గ్రామసభల్లో తిరగబడి విరగబోట్లు పొడుస్తున్నదీ ఆ గ్రామీణులే. 'పల్లెలెట్లా కదుల్తున్నయంటే' అన్నట్టు తయారైంది పరిస్థితి. రేషన్‌కార్డులు, రైతుభరోసా, ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక కోసం, అదీ తూతూ మంత్రంగా జరిపిన గ్రామసభలు ప్రజాగ్రహ వ్యక్తీకరణకు వేదికలు కావడం చూస్తున్నాం. ఊరూరూ సర్కారు పెద్దలపై, అధికార్లపై ప్రజలు మర్లపడుతున్నారు. ఎంపికలే ఎజెండా అయినప్పటికీ కోతలపై, ఎగవేతలపై గ్రామీణులు భగ్గుమంటున్నారు. మంత్రులను నిలదీస్తున్నారు. ఎమ్మెల్యేలను అడ్డుకుంటున్నారు. కరీంనగర్ జిల్లాలో మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్‌కు చేదు అనుభవం ఎదురైంది. యాదాద్రి భువనగిరి జిల్లా అనంతారంలో ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌ను ప్రజలు తరిమివేశారు. రెచ్చిపోయిన ప్రజలు ఒకచోట టెంట్లు పీకేస్తే, మరోచోట అధికారిపై చేయిచేసుకునే దాకా పోవడం ప్రజల్లో రగులుతున్న కోపానికి నిదర్శనం. దాంతో గ్రామసభలు రసాభాసగా మారి బాహాబాహీలతో సంగ్రామసభలుగా పరిణమిస్తున్నాయి. మొదటిరోజు కన్నా రెండోరోజు, అదీ పోలీసు పహరా మధ్యన నిరసనల తీవ్రత పెరగడం గమనార్హం.

నమ్మి నానబోస్తే పుచ్చి బుర్రలైనట్టు సర్కారు హామీలు చట్టుబండలయ్యాయి. అమలు కాని గ్యారెంటీలపై ఎవరిని, ఎక్కడ, ఎలా అడగాలో తెలియక ఇన్నాళ్లుగా తికమక పడుతున్న గ్రామీణులకు ఈ సభలతో ఒక మంచి అవకాశం దొరికినట్టయింది. ఏడాది కాలంగా సర్కారుపై వారిలో గూడుకట్టుకున్న ఆగ్రహం ఈ సభల్లో కట్టలు తెంచుకున్నది. ఓ పక్క కాంగ్రెస్ ఎమ్మెల్యేలు 'నేను ఎంపిక చేసినోళ్లే లబ్ధిదారులు అవుతారని' మీసం మెలేసి చెప్తుంటే ఇంకా ఈ సభలు ఎందుకు పెడుతున్నారని ప్రజలు నిలదీస్తుండటం గమనార్హం. ఎంపికల్లో అవకతవకలను ప్రజలు ఎండగడుతున్నారు. అర్హులను వదిలేసి అస్మదీయులను ఎంపిక చేసేటట్టయితే ఈ తతంగమంతా దేనికి అనేది వారి వాదన. చాలా చోట్ల ప్రజలు లబ్ధిదారుల ఎంపిక సంగతి పక్కన పెట్టి గ్యారెంటీల గురించి ఒక్కుమ్మడిగా నిలదీయడంతో పాలక పక్షీయులు ఊపిరాడక సతమతమయ్యారు. కల్యాణలక్ష్మికి తులం బంగారం ఎప్పుడు జతచేస్తరు? రుణ మాఫీ అందరికీ ఎప్పుడు అందుబాటులోకి వస్తుంది? ఈ ప్రశ్నలకు సమాధానం వారికి తెలిస్తే కదా చెప్పడానికి. ప్రశ్నించినవారిపై పోలీసు జులుం ప్రయోగించడం, రైతుభరోసాపై నిలదీసిన రైతులను బయటకు నెట్టేయడం ఏ తరహా ప్రజాపాలనో అర్థం కావడం లేదు. ఆందోళనలతో గ్రామసభలను అర్ధాంతరంగా ముగించాల్సి రావడం పరిస్థితికి అద్దం పడుతున్నది.

స్థానిక కాంగ్రెస్ నేతలకే కాదు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలకూ నిరసన సెగలు తప్పలేదు. పొట్టచేతపట్టుకుని వేరే ఊరికి వలస పోయినోళ్లకు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వమని అంటున్నారు. మూడంచెల్లో ఇలాంటి అలవిమాలిన అర్హతలతో వడపోస్తారట. ఇక రేషన్ కార్డుల ప్రహసనం వేరే సంగతి. గొరగంగా మిగిలింది జుట్టు అన్నట్టు 6.6 లక్షల మందికే కార్డు లిస్తారట. మిగిలినవారి గతి ఏమిటి? ప్రజాపాలన పేరిట సేకరించిన దరఖాస్తుల మాటేమిటి? ఆత్మీయ భరోసా కూడా అరకొరగానే అమలు అవుతుందనేది తేలిపోయింది. లబ్ధిదారుల సంఖ్య ఎలాగైనా తగ్గించేందుకే సర్కారు నానా కొర్రీలు పెడుతున్నది. మరోవైపు అన్ని నియమాలూ తుంగలో తొక్కి తమ వారికే కట్టబెట్టేందుకు బరితెగిస్తున్నది. అపై కంటితుడుపుగా గ్రామసభలు పెడితే ప్రజలకు కోపం రాకుండా ఉంటుందా? ప్రభుత్వానికి శాపం కాకుండా ఉంటుందా? ■

పెట్టుబడులు లేవు, పట్టువిడుపులే!

వర్ధెల్లి వెంకటేశ్వర్లు

'సిద్దడు సిట్టపాలెం పోనూ పోయిండు.. రానూ వచ్చిండు' అన్నట్టే ఉన్నది తెలంగాణ రైజింగ్ ప్రతినిధుల బృందం దావోస్ పర్యటన. రాను పోను ప్రయాణ వ్యయప్రయాసలు దండుగ తప్ప చిల్లిగవ్వ ఉపకారం ఉన్నదా? కొత్తగా పెట్టుబడులు రావాలన్నా.. పరిశ్రమలు ఏర్పాటు కావాలన్నా.. పరిశ్రమల స్థాపనకు, పారిశ్రామికవేత్తల పెట్టుబడులకు అనుకూల వాతావరణం ఉండాలి. తెలంగాణలో ఇప్పుడా పరిస్థితి ఉన్నదా? ఒకవైపు ఈ-ఫార్ములా రేస్, పారిశ్రామిక ఒప్పందాలతో హైదరాబాద్ ఖ్యాతిని ప్రపంచ పటంలో నిలబెట్టిన మాజీ మంత్రి కేటీఆర్ మీద కేసులు పెట్టి, అరెస్టు చేయాలని పోలీసుల మీద ఒత్తిడి తెస్తూ.. మరోవైపు అనన్య నటనాశక్తితో, అద్భుత సాంకేతిక నిపుణతతో తెలంగాణ చిత్ర సీమ ఇమేజ్‌ను అంతర్జాతీయ వెండి తెరకెక్కించిన పుష్ప సినిమా ఫేం అల్లు అర్జున్‌ను పట్టుబట్టి జైళ్లో పెట్టి.. ఇదే మా ప్రభుత్వం విధానమని తొడగొట్టిన సీఎం రేవంత్‌రెడ్డి ప్రపంచ వాణిజ్య వేదికెక్కి పెట్టుబడులు పెట్టమని అడిగితే.. పారిశ్రామిక వేత్తలు మొఖం చూపిస్తారా? ముందుకు వస్తారా?

కిందటేడాది ఇదే బృందం స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరిగిన ప్రపంచ వాణిజ్య వేదిక (డబ్ల్యూఈఎఫ్) వార్షిక సదస్సుకు వెళ్లింది. రూ.40,232 కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలైపోయినట్టు ప్రకటించింది. ఇంత పెద్ద మొత్తం పెట్టుబడులు గతంలో ఎవరూ తేలే కపోయిండ్రని ఆర్భాటం చేసింది. తీరా చూస్తే అదంతా ఉత్తదే! గతంలో ఒప్పందాలు చేసుకున్న కంపెనీలతోనే మళ్లీ సంతకాలు చేసుకోవడంతో పాటు ఊరూ పేరూ లేని వాటితో కూడా ఎంవోయూలు కుదుర్చుకొని.. ఇక రాష్ట్రానికి కొత్త పరిశ్రమలు వచ్చేసినట్టేనన్నంత బిల్డప్ ఇచ్చారు. లక్షల ఉద్యోగాలు వస్తాయనే కలరింగ్ ఇచ్చారు. ఏడాదైనా ఒప్పందాలు చేసుకున్నట్టుగా పెట్టుబడులు రాలేదు. రేవంత్‌రెడ్డి చెప్పిన ఉద్యోగాలూ ఇవ్వలేదు. ఎంవోయూలు చేసుకున్న పారిశ్రామికవేత్తలు రాష్ట్రం వైపు ముఖం తిప్పి చూడటం లేదు.

దావోస్ వెళ్లి.. అదానీ ప్రతినిధులకు షేక్ హ్యాండ్ ఇచ్చారు. ఆ గ్రూపు తెలంగాణలో రూ.12,400 కోట్ల పెట్టుబడికి ఒప్పుకొన్నట్టు ప్రకటించారు. నాలుగు ఎంవోయూలను కుదుర్చుకున్నట్టు వెల్లడించారు. అదానీ గ్రీన్ ఎనర్జీ రెండు పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్ట్‌లలో రూ.5 వేల కోట్ల పెట్టుబడి, అదానీ కాన్ ఎక్స్ డేటా సెంటర్‌కు రూ.5,000 కోట్ల పెట్టుబడి ఒప్పందం. అదానీ ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్ కౌంటర్ డ్రోన్ సిస్టమ్స్, క్షిపణి అభివృద్ధి, తయారీ కేంద్రాల కోసం రూ.1,000 కోట్ల పెట్టుబడి, అంబుజా సిమెంట్స్ లిమిటెడ్, ఆధునిక సిమెంట్ గ్రైండింగ్ యూనిట్‌లో రూ.1,400 కోట్లు పెట్టుబడి ఎంవోయూ కుదిరిందని సీఎం కార్యాలయం ప్రకటించింది. అదానీ ఆర్థిక అవకతవకల మీద అమెరికాలో కేసు దాఖలైన నేపథ్యంలోనే సిల్క్ యూనివర్సిటీకి అదానీ ప్రకటించిన రూ.100 కోట్లను సీఎం రేవంత్‌రెడ్డి వెనక్కి ఇచ్చేశారు. ఇంత జరిగాక అటు అదానీ గ్రూప్, ఇటు రేవంత్ ప్రభుత్వం పెట్టుబడుల ఒప్పందం నిలబడి ఉంటుందా? అనేది బేతాళుడు కూడా విప్పలేనంత చిక్కుముడి. నిజానికి కేసీఆర్ హయాంలో హైదరాబాద్ పునర్జీవం పోసుకుంటున్న తీరు చూసి అదానీ గ్రూప్ తెలంగాణలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకొచ్చింది. ఒకటి, రెండు సార్లు కాదు.. అనేక పర్యాయాలు అప్పటి ఐటీ మంత్రి కేటీఆర్‌తో చర్చలు జరిపారన్న మాట నిజం. కానీ, తెలంగాణ ప్రభుత్వం నూతన పారిశ్రామిక పాలసీకి విరుద్ధమైన రాయితీలు అడగటం, అతి చౌక ధరలకు మౌలిక వసతుల కల్పన చేయాలనే డిమాండ్, వ్యాపార విధానంలో పాలసీ విరుద్ధమైన కోర్కెలు తదితర కారణాలతో కేసీఆర్ ప్రభుత్వం అదానీ పెట్టుబడులకు అంగీకరించలేదు. కానీ, రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అదే గ్రూప్‌ను నెత్తిన పెట్టుకొని ఊరేగింది.

కేసీఆర్ విజన్ తెలిసిన నేత కాబట్టి తెలంగాణ యువతకు ఉపాధి చూపించి, జీవన ప్రమాణాలను పెంచే పెట్టుబడులను ఆకర్షించేందుకు 2014లోనే తెలంగాణ పారిశ్రామిక విధాన ముసాయిదాను రూపొందించి అమలుచేశారు. పారిశ్రామిక వినియోగ అవసరాల కోసం సుమారు 2.50 లక్షల ఎకరాల సాగుకు యోగ్యం కాని బంజరు భూములను గుర్తించి పారిశ్రామిక ల్యాండ్ బ్యాంక్‌ను అభివృద్ధి చేసిపెట్టారు. రెడ్ కాటగిరీ పరిశ్రమల ఏర్పాటు కోసం జనావాసాలకు దూరంగా, సురక్షితమైన ప్రదేశాల్లో దాదాపు 74,133 ఎకరాల్లో 150 వరకు ప్రత్యేక పారిశ్రామిక పార్కులు ఏర్పాటుచేశారు. నూతన ఆవిష్కరణలను, పారిశ్రామిక స్ఫూర్తిని పెంపొందించేందుకు విపణి పరిశోధన నిధిని ఏర్పాటుచేశారు. ఇది కాకలుతీరిన పారిశ్రామిక దిగ్గజాల ఊహకు కూడా అందనంత గొప్ప ఆలోచన. దీంతో జాతీయ, అంతర్జాతీయ స్థాయి కంపెనీలు తెలంగాణకు క్యూ కట్టాయి. పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టాయి. ఐటీ, ఫార్మా, ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్ తదితర రంగాల్లో ప్రపంచ ప్రఖ్యాత కంపెనీలు రాష్ట్రంలో కొలువుదీరాయి. తెలంగాణ పారిశ్రామిక హబ్‌గా ఎదిగింది. 2021, డిసెంబర్ నుంచి 2024 డిసెంబర్ వరకు మూడేండ్ల కాలంలో రూ.2.70 లక్షల కోట్ల పెట్టుబడులు తెలంగాణ రాష్ట్రం సాధించింది. రాష్ట్ర జీడీపీలో 6 శాతం ఉన్న ఉత్పాదక రంగం జీడీపీ 23 శాతానికి పెరిగింది.

> విచిత్రం ఏమంటే.. కేసీఆర్ హయాంలో హైదరాబాద్‌లో మేము బేషరతుగా పెట్టుబడులు పెడతామని మన ఇంటి ముంగిటకొచ్చిన కంపెనీలకు ఇప్పటి పాలకులు దావోస్ కలరింగ్ ఇస్తున్నారు. ఆయా కంపెనీల పెట్టుబడి ఒప్పందాలు తమ లాబీయింగ్ ఘనతగా భుజకీర్తులు తడుముకుంటున్నారు.

రేవంత్‌రెడ్డి ప్రభుత్వం గొప్పగా చెప్తున్న అంతర్జాతీయ కంపెనీలలో జేఎస్‌డబ్ల్యూ నియో ఎనర్జీ ఒకటి. తెలంగాణలో రూ.9 వేల కోట్ల పెట్టుబడితో 1,500 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం గల పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్ట్‌ను ఏర్పాటు చేయనున్నట్టు ప్రకటించింది. ముంబై కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న జేఎస్‌డబ్ల్యూ ఎనర్జీ థర్మల్, హైడ్రో, సౌర వనరుల నుంచి విద్యుత్తును ఉత్పత్తి చేస్తుంది. ఈ కంపెనీతో ముందుగా చర్చలు జరిపి ఒప్పించింది అప్పటి మంత్రి కేటీఆర్ అనే విషయం పారిశ్రామిక వర్గాల్లో అందరికీ తెలిసిందే. ఇక రెండో కంపెనీ ఆరెజెన్ లైఫ్ సైన్సెస్ పరిశ్రమ. ఔషధాల సృష్టి, అభివృద్ధి, తయారీ సేవల విభాగంలో 20 ఏండ్లకు పైగా అనుభవం ఉన్నది. ఈ కంపెనీ ఫార్మా స్యూటికల్, బయో టెక్నాలజీ కాంట్రాక్ట్ రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ కార్యకలాపాలు ఇప్పటికే హైదరాబాద్‌లో కొనసాగుతున్నాయి. ఈ కంపెనీతో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రూ.2000 కోట్ల ఎంవోయూ చేసుకున్నట్టు చెప్పుకొంటున్నది. నిజానికి ఇది కంపెనీ కార్యకలాపాల విస్తరణ ఒప్పందం మాత్రమే. కాకుంటే, ఈ ఒప్పందం దావోస్‌లో జరిగింది కాబట్టి, ఇది తమ గొప్పతనమే అని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం భుజాలు ఎగురవేస్తున్నది. చెప్పుకొంటూ పోతే డేటా సెంటర్ల నిర్వహణలో అగ్రగామి సంస్థల్లో ఒక్కటైన ఐరన్ మౌంటెయిన్ అనుబంధ సంస్థ వెబ్ వెర్స్, గోద్రెజ్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ ఇలా ప్రతి కంపెనీకి కేసీఆర్ ప్రభుత్వంలోనే తెలంగాణలో బాటలు పడ్డాయి. మరో కంపెనీ గోడి ఇండియా ప్రైవేట్ లిమిటెడ్. ఆ కంపెనీ తెలంగాణలో రూ.8 వేల కోట్ల పెట్టుబడితో ఆర్ అండ్ డీతో పాటుగిగా సెల్ బ్యాటరీ సెల్ తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు ఒప్పందం కుదుర్చుకున్నట్టు సీఎంవో కార్యాలయం గత ఏడాది ప్రకటించింది. ఈ యూనిట్‌లో 12.5 జీడబ్ల్యూహెచ్ (గిగావాట్ పర్ అవర్) సామర్థ్యం ఉండే బ్యాటరీ సెల్ తయారు చేయనున్నట్టు చెప్పారు. రాబోయే ఐదేండ్ల వ్యవధిలో తెలంగాణలో లిథియం, సోడియం అయాన్, సంబంధిత సాంకేతిక పరిజ్ఞానాల పరిశోధన, అభివృద్ధి (ఆర్‌అండ్‌డీ), గిగా సెల్ సెల్ తయారీ కేంద్రం నెలకొల్పనున్నట్టు ప్రకటించింది. కంపెనీ చరిత్ర చూస్తే ఇది సెల్ కంపెనీ అనటం కంటే షెల్ కంపెనీ అనటం ఉత్తమం. ఈ అన్‌లిస్టెడ్ కంపెనీ మూల పెట్టుబడి రూ.1.5 కోట్లకు మించి కనిపిస్తలేదు. కానీ, ఇది తెలంగాణలో రూ.8 వేల కోట్లు పెట్టుబడి ఎలా పెడుతుందనే సందేహానికి ఎప్పటికీ సమాధానం దొరుకదు.

దావోస్ సదస్సుకు అంతర్జాతీయ స్థాయి ప్రముఖ కంపెనీల ప్రతినిధులు, ఆయా దేశాలకు చెందిన నాయకులు, విధాన నిర్ణయాలు చేసే ప్రముఖులు హాజరవుతారు. కాబట్టి అక్కడ సహజంగానే నాయకులు.. కంపెనీల ప్రతినిధుల మధ్య చర్చలు జరుగుతాయి. ఈ క్రమంలోనే పెట్టుబడి పెట్టేందుకు ముందుకు రావడం, ఒప్పందాలు చేసుకోవడం జరుగుతుంది. కానీ, మన దగ్గర పెట్టుబడులు పెట్టడానికి కావలసిన ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఏం ఉన్నదనేది ముఖ్యం. ఇప్పుడు తెలంగాణలో ఇలాంటి వాతావరణం ఉన్నదా? ఇప్పటి పాలనలో కొత్త పరిశ్రమలు రాకపోగా, ప్రభుత్వ విధానాలతో విసిగిపోయి ఉన్న పరిశ్రమలు కూడా పొరుగు రాష్ట్రాల బాట పట్టాయి.

> సూక్ష్మ, చిన్న, మధ్యతరహా (ఎంఎస్ ఎంఈ) పరిశ్రమలకు ప్రభుత్వం చేయూతనివ్వలేదు. విద్యుత్తు సౌకర్యం, పారిశ్రామిక ప్రోత్సాహం లేక చిన్న పరిశ్రమలు కుదేలైపోతున్నాయి. ఇదిట్లా ఉంటే.. ఈ- ఫార్ములా కార్ రేసు కేసులో కోరి గుడ్డు మీద ఈకలు పీకినట్టుగా ఇన్వెస్టిగేషన్ చేస్తున్న రేవంత్‌రెడ్డి ఫార్ములాను ప్రపంచ దేశాలు, పారిశ్రామికవేత్తలు గమనిస్తున్నారు.

కంపెనీ ఇమేజ్ డ్యామేజ్ చేసుకొని, కేసుల పాలవటానికి పారిశ్రామికవేత్తలు హైదరాబాద్‌ను వెతుక్కుంటూ వస్తారా? చిన్న వెలుగు.. చిమ్మ చీకట్ల తెరలు దాటుకొని టాలీవుడ్ ఇప్పుడిప్పుడే ప్రపంచస్థాయికి ఎదిగింది. పుష్ప, బాహుబలి, ఆర్‌ఆర్‌ఆర్, దేవర చిత్రాలు అంతర్జాతీయ వెండితెర మీద మెరిశాయి. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ఫిల్మ్ మేకర్స్ హైదరాబాద్ వైపు చూడటం మొదలుపెట్టారు. మన దగ్గర షూటింగ్ చేయటానికి ప్లాన్ చేసుకుంటున్నారు. ఇలాంటి సందర్భంలో అల్లు అర్జున్ అరెస్టు సినిమా పరిశ్రమకు ఓ కుదుపుగా మారింది.

అన్ని వర్గాలను కలుపుకొని పోయిన కేసీఆర్ పాలన పారిశ్రామిక విధానానికి, వ్యవసాయ రంగానికి ఒక స్వర్ణయుగం. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, పారిశ్రామిక దిగ్గజాలు హైదరాబాద్‌కు వరసకట్టారు. 12 ప్రధాన రంగాల్లో రూ.లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టడంతో పారిశ్రామిక ఉత్పాదక జీడీపీ అత్యధికంగా 23 శాతం మైలురాయిని అందుకున్నది. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా, భారీ పరిశ్రమల్లో కలిపి దాదాపు పదేండ్ల కాలంలో కోటి మందికి ఉద్యోగ, ఉపాధి కల్పన జరిగింది. అట్లాగే భారీ ఎత్తిపోతల ప్రాజెక్టులతో కోటి ఎకరాల మాగాణికి నీళ్లు అందినయి. అటు సాంకేతిక, పారిశ్రామిక రంగాలు, ఇటు వ్యవసాయరంగాన్ని జోడు గుర్రాల తీరు పరుగెత్తించిన కేసీఆర్ తరహా పాలకుడు ప్రపంచ రాజకీయ చరిత్రలో మరొకరు కనిపించరు. ■

> దావోస్ సదస్సుకు అంతర్జాతీయ స్థాయి ప్రముఖ కంపెనీల ప్రతినిధులు, ఆయా దేశాలకు చెందిన నాయకులు, విధాన నిర్ణయాలు చేసే ప్రముఖులు హాజరవుతారు. కాబట్టి అక్కడ సహజంగానే నాయకులు.. కంపెనీల ప్రతినిధుల మధ్య చర్చలు జరుగుతాయి. ఈ క్రమంలోనే పెట్టుబడి పెట్టేందుకు ముందుకు రావడం, ఒప్పందాలు చేసుకోవడం జరుగుతుంది. కానీ, మన దగ్గర పెట్టుబడులు పెట్టడానికి కావలసిన ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఏం ఉన్నదనేది ముఖ్యం. ఇప్పుడు తెలంగాణలో ఇలాంటి వాతావరణం ఉన్నదా?

యూజీసీ ముసాయిదాతో ఉన్నత విద్యకు నష్టం

> కాలేజీ టీచర్ల నియామకాలు, ప్రమోషన్లకు సంబంధించి కనీస అర్హతలు, ఉన్నత విద్యలో ప్రమాణాల నిర్వహణ కోసం నిబంధనల ముసాయిదాపై ఫిబ్రవరి 5వ తేదీ లోపు అభిప్రాయాలు తెలపాలంటూ యూజీసీ కోరుతున్నది. ఈ నిబంధనలు స్థూలంగా జాతీయ విద్యావిధానం 2020 నిర్దేశాలకు అనుగుణంగా, కార్పొరేట్లకు అనుకూలంగా, టీచర్లపై ఒత్తిడి పెంచేవిగా ఉన్నాయి.

గతంలో టీచర్ల పనితీరును అంచనా వేసేందుకు అకడమిక్ పర్ఫార్మెన్స్ ఇండికేటర్స్ మార్కులతో లెక్కించి ప్రమోషన్లు ఇచ్చేవారు. మార్చిన నిబంధనల క్లాజ్ 3.8 ప్రకారం తొమ్మిదింటిలో కనీసం నాలుగు విషయాల్లో మార్కుల ప్రాతిపదికన కాకుండా గుర్తించదగిన ప్రతిభపై ఆధారపడి టీచర్ల ఎంపిక, ప్రమోషన్లు ఉంటాయి. అవి (1) బోధనలో వినూత్న విధానాలను అనుసరించే ప్రతిభ, (2) బోధన, పరిశోధన విషయాలపై ప్రయోగశాలలను ఏర్పరిచే సామర్థ్యం, (3) ప్రాయోజిత పరిశోధనకు ప్రధాన పరిశోధకుడిగా ఉండటం, (4) భారతీయ భాషల్లో బోధనకు చేసే కృషి, (5) ఇండియన్ నాలెడ్జ్ సిస్టంలో బోధన, పరిశోధనలకు చేసే కృషి, (6) విద్యార్థుల ఇంటర్న్‌షిప్, ప్రాజెక్టుల పర్యవేక్షణ, (7) ఎంవోవోసీఎస్ కోసం డిజిటల్ కంటెంట్‌ను అభివృద్ధి పరచడం, (8) సామాజిక సేవా కార్యక్రమాల్లో గుర్తించదగిన భాగస్వామ్యం, (9) రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్‌లో రిజిస్టరై ఉన్నత విద్యాసంస్థల మేధోసంపత్తి విధానాలకు అనుగుణంగా స్టార్టప్‌లను ప్రారంభించడం. వృత్తి ప్రారంభ దశలో టీచర్ల నియామకానికి ఈ విషయాలను పరిగణనలోకి తీసుకోవడం సరైనది కాదు. ఎందుకంటే ఉన్నత విద్యలో పనిచేసిన అనుభవం ఉంటే తప్ప వీటిలో కృషిచేసే అవకాశం ఉండదు. ఒకవేళ కాంట్రాక్టు టీచర్‌గానో, గెస్ట్ టీచర్‌గానో అనుభవాన్ని కలిగి ఉన్నా, వారికి ఈ విషయాల్లో తమ సామర్థ్యాన్ని నిరూపించుకునే అవకాశాలు సరిగా ఉండవు.

> క్లాజ్ 3.8-2,3,6,9 పాయింట్లు కార్పొరేట్ చోదక అజెండాగా కనిపిస్తున్నాయి. టీచర్లు ప్రయోగశాలను ఏర్పరచుకోవడం, స్పాన్సర్లను వెతుక్కుని ఇన్వెస్టిగేటర్స్‌గా ఉండటం, ఇంటర్న్‌షిప్‌ల పర్యవేక్షణ వంటివి కార్పొరేట్ల సహకారంతో చేపట్టాలని చెప్తున్నాయి. బిర్లా-అంబానీ కమిటీ ప్రతిపాదనలను ఉచ్ఛస్థితికి తీసుకెళ్లే ప్రతిపాదనలు ఇవి. దీని కితోడు 'ప్రొఫెసర్ ఆఫ్ ప్రాక్టీస్' పేరుతో వేకెన్సీలో 10 శాతం వరకు ఇండస్ట్రీ, ఇతర నాన్ అకడమిక్ వృత్తులకు సంబంధించిన వ్యక్తులను నియమించుకోవచ్చని క్లాజ్ 9 చెప్తున్నది. దీనిని బట్టి ప్రస్తుతం ఉన్న హయ్యర్ ఎడ్యుకేషన్ ఫ్యాకల్టీ అవగాహన రహితులన్న చెడు అభిప్రాయాన్ని ఇది కలిగిస్తున్నది.

అకడమిక్ నేపథ్యం కలిగిన వ్యక్తినే వీసీలుగా నియమించాలని గత నిబంధనలు చెప్తున్నాయి. కానీ, ప్రస్తుత నిబంధనలు బ్యూరోక్రాట్లు, ఇండస్ట్రీ వ్యక్తులు కూడా వీసీలు కావొచ్చని స్పష్టం చేస్తున్నాయి. విద్యాసంస్థలను ప్రొఫెషనల్ అడ్మినిస్ట్రేటర్స్‌తోనే నడపాలనే మౌలిక నియమానికి ఇది వ్యతిరేకం. ఈ నిబంధనలు వీసీల నియామక కమిటీ చైర్‌పర్సన్ నియామకానికి గవర్నర్‌కు అధికారాలు ఇస్తున్నాయి. దీనివలన కేంద్ర ప్రభుత్వ జోక్యం పెరిగే అవకాశం ఉంటుంది. ఫెడరల్ స్ఫూర్తికి ఇది విరుద్ధం. గవర్నర్లు యూనివర్సిటీల చాన్స్‌లర్లుగా ఉండటం వల్ల తటస్థంగా ఉండాల్సిన వారు సున్నితమైన రాజకీయ పరిస్థితుల్లోకి లాగబడుతున్నారని, కేంద్ర, రాష్ట్ర సంబంధాల సమీక్ష కోసం నియమించిన జస్టిస్ మదన్మోహన్ పూంచి కమిషన్ భావించింది. యూనివర్సిటీల చాన్స్‌లర్లుగా గవర్నర్లను నియమించరాదని అది సూచించింది.

పాయింట్ 7.. డిజిటల్ కంటెంట్ అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నది. పరోక్షంగా ఇది ఆన్‌లైన్ విద్యను ప్రోత్సహిస్తుంది. దీనివల్ల టీచర్లపై పని ఒత్తిడి పెరిగే అవకాశం ఉన్నది. క్లాజ్ 5. 6. 3, 5. 6. 4 ప్రకారం టీచర్లకు ప్రమోషన్లు వారి వ్యక్తిగత ప్రమోషన్ తేదీలతో కాకుండా సంవత్సరంలో రెండు పర్యాయాలు, జనవరి, జూలై నెలల్లోనే ఇస్తారు. అంటే ప్రమోషన్ తేదీ జనవరి ఒకటి నుంచి జూన్ ముప్పై వరకు ఉన్న ఏ టీచర్‌కు అయినా జూలై ఒకటవ తేదీ నుంచి మాత్రమే ప్రమోషన్ లెక్కిస్తారు. అలాగే, జూలై ఒకటి నుంచి డిసెంబర్ ముప్పై ఒకటి వరకు ప్రమోషన్ తేదీలు కలిగిన వారికి తరువాతి సంవత్సరం జనవరి ఒకటి నుంచే ప్రమోషన్ లెక్కిస్తారు. దీనివల్ల టీచర్లు నష్టపోయే అవకాశం ఉన్నది.

2018 యూజీసీ నిబంధనల ప్రకారం కాంట్రాక్టు టీచర్ల నియామకం.. ఉన్న ఖాళీల్లో 10 శాతానికి మించకూడదు. కానీ కొత్త నిబంధనలు ఈ నిబంధనను తొలగిస్తున్నాయి. అంటే ఇకపై ఎలాంటి పరిమితి లేకుండా కాంట్రాక్ట్ టీచర్లను నియమించుకోవచ్చు. కాంట్రాక్టు టీచర్లు లేని వ్యవస్థను అభివృద్ధి పరుచుకోవాలనే స్ఫూర్తికి ఇది వ్యతిరేకం. దేశంలో యూనివర్సిటీ, కాలేజీ టీచర్ల సంఘాల అతి పెద్ద సమూహ్య అయిన ఏఐఎఫ్‌యూసీటీవో ఈ కొత్త నిబంధనలను నిర్ద్వంద్వంగా వ్యతిరేకిస్తున్నది, వీటిని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తున్నది.

ఎడమ శ్రీనివాసరెడ్డి, 99499 05069
(వ్యాసకర్త: అధ్యాపకులు, కాకతీయ ప్రభుత్వ కళాశాల, హన్మకొండ)

దాడుల సంస్కృతి కాంగ్రెస్‌దే

చాడ సృజన్‌రెడ్డి

> నియంత రాజ్యాలు, నియంతృత్వ పాలన ఎక్కువ కాలం మనుగడ సాగించలేవు. పుటలను తిరగేసి చూస్తే చరిత్ర మనకు చెప్పేది ఇదే. ప్రపంచ రాజకీయాలను ఒకసారి పరికించి చూస్తే ప్రజాస్వామ్యాన్ని పరిహాసం చేస్తూ పాలన సాగిస్తున్న దక్షిణ కొరియా అధ్యక్షుడు యూన్ సుక్ యోల్, ఫ్రాన్స్ ప్రధాని ఎలిజబెత్ బోర్న్ పదవి నుంచి దిగిపోవలసి వచ్చింది. ఇప్పుడు కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో వంతు వచ్చింది. అంతెందుకు మన దేశంలోనే ఇలాంటి ఉదాహరణలు అనేకం. ప్రజాతీర్పును కాలరాస్తూ దేశాన్ని ఎమర్జెన్సీ కూపంలోకి నెట్టిన ఇందిరాగాంధీ చిత్తు చిత్తుగా ఓడిపోయిన ఉదంతాన్ని ఈ దేశం కండ్లారా చూసింది.

దేశ ప్రజలను పీడించడమే తన పీఠానికి పునాదిగా చేసుకొని పాలించిన ఇందిరా గాంధీని ఆదర్శంగా తీసుకున్న కాంగ్రెస్ నాయకులు.. అసెంబ్లీ ఎన్నికలకు ముందు తాము అధికారంలోకి వస్తే తెలంగాణలో ఇందిరమ్మ రాజ్యం తీసుకొస్తామని వాగ్దానం చేశారు. వారు ఎన్నికల్లో ఇచ్చిన 6 గ్యారెంటీలు, 420 హామీలను అమలు చేయకపోయినా ఇందిరమ్మ రాజ్యాన్ని తీసుకొస్తామన్న వాగ్దానా